## 17న సీఈవో సమావేశం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని టాప్ ఐదు వార్తాపత్రికలు, ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్స్, టీవీ చానళ్లు, ఇన్‌ఫ్లూయెన్సర్లతో హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో ఈనెల 17న సమావేశం నిర్వహించనున్నట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) మార్గదర్శకాలు, సూచనలను విస్తృతంగా ప్రచారం చేయడం కోసం మంగళవారం సాయంత్రం 4గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ఎడిటర్లు, తెలంగాణ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



చిన్నశంకరంపేట, జూన్ 12 : ఆటో సరిగ్గా నడవక కొద్దిరోజులు దిగులుతో ఉన్న ఆటోడ్రైవర్ గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం కామారం గిరిజన తండాకు చెందిన హలావత్ యాదగిరి(36) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో నడవడంలేదు. ఆటోపై తీసుకున్న ఫైనాన్స్ కట్టలేక కొన్ని రోజులుగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య నీల, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

## నేడు డ్రా పద్ధతిలో 28బార్ల కేటాయింపు

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 28బార్లకు నోటిఫికేషన్ ఇచ్చిన ఎక్సైజ్‌శాఖ.. శుక్రవారం డ్రా పద్ధతిలో కేటాయించనున్నది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 24 బార్లు ఉండగా, 3,520 దరఖాస్తులు వచ్చాయి. సరూర్‌నగర్‌లో జల్‌పల్లి మున్సిపాలిటీ బార్‌కు 57, మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ బార్‌కు 49, నిజామాబాద్, బోధన్‌లో 42 దరఖాస్తులు వచ్చాయి. వాటికి ఆయా జిల్లాల కలెక్టరేట్ పరిధిలో డ్రా తీయనున్నారు.

# ఇదేనా సామాజిక న్యాయం?

- తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో యాదవులకు చోటేదీ?
- 27న ఆత్మగౌరవ సభ నిర్వహిస్తాం
- తీరు మారకపోతే కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో బొంద పెడతాం
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ధ్వజం
- గొల్ల కురుమలకు అన్యాయం : బీర్ల
- బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలి: గిరిజన జేఏసీ డిమాండ్





హైదరాబాద్, జూన్12 (నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్: యాదవ, కురుమల జనాభా దామాషా ప్రకారం ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ మోసం చేసిందని, ఇదేనా రాహుల్‌గాంధీ పాటించే సామాజిక న్యాయం? అని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పదవులతోపాటు పార్టీ పదవుల్లోనూ యాదవ, కురుమలకు కాంగ్రెస్ మొండిచేయి చూపిందని, రాహుల్‌గాంధీ ప్రవచించే సామాజిక న్యాయం డొల్ల అని నిరూపితమైందని విమర్శించారు. ఇకనైనా అత్యధిక జనాభా కలిగిన యాదవులు, మున్నూరుకాపులతోపాటు ఎంబీసీలకు వెంటనే మంత్రి పదవులు ఇవ్వాలని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ, 27న ఇందిరాపార్క్ దగ్గర యాదవ-కురుమల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం దిగిరాకపోతే స్థానికసంస్థల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెడతామని హెచ్చరించారు.

**గొల్ల కురుమలకు అన్యాయం: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

కాంగ్రెస్ ప్రభుత్వంలో గొల్ల, కురుమలకు అన్యాయం జరిగిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో 22 లక్షల మంది యాదవులు, ఆరు లక్షల మంది కురుమలు ఉన్నారని, అయినప్పటికీ మంత్రి పదవికానీ, ప్రభుత్వ సలహాదారు పదవి కానీ దక్కలేదని చెప్పారు. గొల్ల కురుమలకు ఎమ్మెల్సీ, ఐదు కార్పొరేషన్ చైర్మన్లు, ఐదు కమిషన్ సభ్యుల పదవులు, పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్, మూడు వైస్ ప్రెసిడెంట్స్, 8 జనరల్ సెక్రటరీలు, 5 డీసీసీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**డిప్యూటీ సీఎంకు యాదవ సంఘాల వినతిపత్రం**

మంత్రివర్గంలోనూ, పార్టీ పదవుల్లోనూ, నామినేటెడ్ పోస్టుల్లోనూ గొల్ల, కురుమలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కుల సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ప్రజాభవన్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు.

### బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలి: గిరిజన జేఏసీ

రవీంద్రభారతి, జూన్ 12: జనాభా ప్రతిపాదికన బంజారాలకు మంత్రి పదవి కేటాయించాలని బంజారా గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో బంజారా గిరిజన జేఏసీ నాయకులు డాక్టర్ వెంకటేశ్ చౌహన్, డాక్టర్ రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో బంజారాలకు మంత్రి పదవి ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వంలో లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. త్వరలో ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలుస్తామని చెప్పారు. భారత రాజ్యాంగం బంజారా గిరిజనులకు కల్పించిన హక్కుల సాధన కోసం బంజారాల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. బంజారా గిరిజన సంఘాలతో కలిసి పార్టీలకతీతంగా ఐక్య కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు మూడావత్ కార్తీక్‌నాయక్, శ్రీమాన్‌నాయక్, ధరావత్ వినోద్ నాయక్, ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐతరాజు అభయ్, డీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ్రపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## ఇక్కత్ చేనేత వస్త్రాలకు ప్రపంచ ఖ్యాతి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- భూదాన్ పోచంపల్లిలో నేతన్నలతో ముఖాముఖి
- 'కేసీఆర్' తెచ్చిన పథకాలపై లబ్ధిదారుల ప్రశంసల వర్షం

యాదాద్రి భువనగిరి, జూన్ 12 (నమస్తే తెలంగాణ): భూదాన్‌పోచంపల్లి ఇక్కత్ చేనేత వారసత్వంగా వస్తున్న కళ అని, ఈ వస్త్రాలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో ఇక్కత్ చేనేత కార్మికులతో మాట్లాడి, పోచంపల్లి టూరిజం టెక్స్‌టైల్ పార్కులో పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కత్ చీరలు, ఉత్పత్తులు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయని, ఇటీవల ప్రపంచ సుందరీమణుల సందర్శనతో 30 శాతం అమ్మకాలు పెరిగాయని తెలిపారు. ఇక్కత్ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తే చేనేత కార్మికులను కాపాడిన వారమవుతామని చెప్పారు. నేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులు, జీవన విధానాలు, ఇక్కత్ ఉత్పత్తుల తయారీలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేత కార్మికులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ తీసుకొచ్చిన పొదుపు, నేతన్నకు బీమా స్కీంపై ప్రశంసల వర్షం కురిపించారు.

'30 సంవత్సరాల నుంచి మగ్గం నేస్తున్నా. చిన్నప్పుడే భర్త చనిపోతే నలుగురు పిల్లల్ని చేనేత పైన ఆధారపడి బతికించుకుంటున్నా. ప్రభుత్వం త్రిఫ్ట్ పథకం పెట్టడం బాగుంది' అని భారత గగన అనే నేత కార్మికురాలు తెలిపారు. 'త్రిఫ్ట్ పథకంలో చేరి 36 నెలలు రెండు వేల రూపాయల చొప్పున చెల్లించాం. ప్రస్తుతం రెండు లక్షలు వచ్చాయి. దీని ద్వారా ఇళ్లు నిర్మించుకున్నాం. చాలా సంతోషంగా ఉంది' అని గుర్రం హేమలత పేర్కొన్నారు. మరో నేత కార్మికురాలు శశికళ మాట్లాడుతూ చేనేత బీమా పథకం వల్ల చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

# కార్మికుల పిల్లలకు 35% మెడికల్ సీట్లు

- దేశవ్యాప్తంగా ఈఎస్ఐసీ దవాఖానల్లో చాన్స్
- సనత్‌నగర్ ఈఎస్ఐసీ దవాఖానలోనూ అవకాశం
- నిరుడు దవాఖానలో 72.69లక్షల మందికి చికిత్సలు
- వైద్య కళాశాల డీన్ శిరీశ్‌కుమార్ జీ చవాన్ వెల్లడి
- దవాఖానను సందర్శించిన జాతీయ మీడియా బృందం



సనత్‌నగర్ ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ దవాఖానను పరిశీలిస్తున్న జాతీయ మీడియా బృందం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తేతెలంగాణ): ఈఎస్ఐసీ వైద్య కళాశాలల్లో 35% కార్మిక కుటుంబాల పిల్లలకు ఎంబీబీఎస్ సీట్లను రిజర్వ్ చేసినట్టు హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ వైద్యకళాశాల డీన్ శిరీశ్ కుమార్ జీ చవాన్ తెలిపారు. దీని వల్ల దేశంలో అన్ని ఈఎస్ఐ వైద్య కళాశాలల్లో కార్మికుల పిల్లలకు ఎంబీబీఎస్ విద్యను చదువుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. తెలంగాణలో కేంద్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) దవాఖాన సేవలను విస్తృతం చేసినట్టు ఆయన తెలిపారు. ఏటా గణనీయంగా వైద్య సేవలు అందిస్తున్నామని, నిరుడు 72 లక్షల 69 వేల మందికి పైగా ఇన్‌పేషెంట్లకు వైద్య చికిత్సలు అందించినట్టు వివరించారు. గురువారం సనత్‌నగర్ ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ దవాఖాన పనితీరు, ఇక్కడ కార్మికులు, వారి కుటుంబాలకు అందుతున్న సేవలను అధ్యయనం చేసేందుకు జాతీయ మీడియా బృందం పర్యటించింది. దవాఖానలోని వివిధ విభాగాలు, ఇక్కడ అందుతున్న సేవలను బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మీడియా బృందానికి దవాఖానలో అందిస్తున్న సేవల వివరాలను శిరీశ్‌కుమార్ జీ చవాన్ వివరించారు. వైద్యవిద్యను అభ్యసిస్తున్న మహారాష్ట్ర, హర్యానాకు చెందిన కార్మికుల పిల్లలు మహేశ్, భూమికతో అధ్యయన బృందం సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాధిక, ఈఎస్ఐ దక్షిణ భారత ప్రాంత కమిషనర్ ఆశిఫ్ ముళ్లక్, పీఐబీ అదనపు సంచాలకులు మనీశ్ గౌతమ్, వైద్యకళాశాల సిబ్బంది, పీఐబీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆటో మీటర్‌చార్జీలు పెంచడానికి కృషి చేస్తా

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఆటోమీటర్ చార్జీల పెంపు, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. జీహెచ్‌ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు ఇవ్వడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు కూనంనేనిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ బీ వెంకటేశం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు పెంచడంతోపాటు, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సహాయాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఊబర్, రాపిడోల నుంచి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

# డ్రగ్స్‌పై సమష్టిగా పోరాడుదాం

- అక్రమ రవాణాపై సమాచారం మార్పిడి చేసుకుందాం
- అంతర్రాష్ట్ర ఆపరేషన్లకు ప్రత్యేకంగా ఎస్‌వోపీని తేవాలి
- డ్రగ్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మీటింగ్‌లో తీర్మానం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): దేశం నుంచి డ్రగ్స్ మహమ్మారిని పారదోలేందుకు 'డ్రగ్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు' కలిసికట్టుగా పోరాడాలని కోరుతూ తీర్మానించాయి. గురువారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అంతర్రాష్ట్ర మాదకద్రవ్య నిరోధక సంస్థల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రతో పాటు కేంద్ర సంస్థలైన ఎన్‌సీబీ, డీఆర్ఐ, కస్టమ్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇమ్మిగ్రేషన్ బ్యూరో ప్రతినిధులు హాజరయ్యారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై సమష్టిగా పోరాడాలని, సమాచార మార్పిడిని మెరుగుపర్చాలని, ఆపరేషన్లలో సమన్వయం ఉండాలని ఏజెన్సీలు ఈ భేటీలో నిర్ణయాలు తీసుకున్నాయి. ట్రాఫికింగ్ మార్గాలు, పరారీలో ఉన్న నిందితుల వివరాలు, అంతర్రాష్ట్ర ఆపరేషన్ల కోసం ప్రత్యేకమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ) రూపొందించాలని, డిజిటల్ ఫైనాన్స్, ఆర్థిక లావాదేవీల మూలాలను గుర్తించాలని, అందుకు ఫోరెన్సిక్, సాంకేతికత మార్పిడి వంటి అశాలపై తీర్మానాలు చేశాయి. కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ జితేందర్, టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, టీజీ న్యాబ్ డీఐజీ అభిషేక్ మోహంతి, ఎస్పీ రూపేశ్, డీఆర్ఐ ఏడీజీ కేఎస్‌వీవీ ప్రసాద్, మహారాష్ట్ర స్పెషల్ ఐజీ శారద రౌత్, గోవా డీఐజీ వర్ష శర్మ, కేరళ డీఐజీ పీ విమలాదిత్య, ఆంధ్రప్రదేశ్ ఎస్పీ కే నాగేశ్‌బాబు, తమిళనాడు ఎస్పీ మైలవగనన్, కర్ణాటక డీఎస్పీ ఎంసీ శివకుమార్, ఎన్‌సీబీ డిప్యూటీ డీజీ టీజీ వెంకటేశ్, అదనపు డైరెక్టర్ అరవిందన్ పాల్గొన్నారు.

## పీఎస్సీతో తొలగనున్న లీగల్ చిక్కులు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ నియామక ప్రక్రియలో న్యాయపరమైన చిక్కులను తొలగించేందుకు పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) చాలా దోహదపడుతుందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గురువారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నల్సార్ యూనివర్సిటీలో 'ఉద్యోగ నియామకాల్లో న్యాయపరమైన చిక్కులు' అంశంపై ఏర్పాటు చేసిన జాతీయ సదస్సులో యూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్‌తో కలిసి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. సదస్సు నిర్వహణలో టీజీపీఎస్సీ చొరవ చూపిందని అభినందించారు. అజయ్ కుమార్ మాట్లాడుతూ పీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామక ప్రక్రియలో వివాదాలను తగ్గించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లార్జ్ లాంగ్వేజ్ మాడల్స్, డిజిటలైజేషన్‌ను ఉపయోగించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. సదస్సులో టీజీపీఎస్సీ చైర్మన్ వెంకటేశం, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ముగ్గురు ఇన్‌చార్జి మంత్రుల తొలగింపు

- కోమటిరెడ్డి, ఉత్తమ్, సురేఖకు కోత
- మరో ముగ్గురు మినిస్టర్లకు జిల్లాల మార్పు

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ముగ్గురు ఇన్‌చార్జి మంత్రులను తొలగించింది. కొత్తగా ఉమ్మడి పది జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు సీనియర్ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖను జిల్లాల బాధ్యతల నుంచి తప్పించింది. వీరి బాధ్యతలను కొత్త నియామకమైన మంత్రులు వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరికి అప్పగించింది. మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరావు, సీతక్క గతంలో ఇన్‌చార్జులుగా వ్యవహరించిన జిల్లాలను మార్చింది. మిగిలిన వారిని యథాతథంగా కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. గ్రేడింగ్‌లో వెనుకబడినందునే ఇన్‌చార్జి బాధ్యతల తొలగింపు, శాఖల మార్పు అని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

**ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు**

| జిల్లా | ఇన్‌చార్జి మంత్రి |
| --- | --- |
| ఆదిలాబాద్ | జూపల్లి కృష్ణారావు |
| నిజామాబాద్ | ధనసరి సీతక్క |
| కరీంనగర్ | తుమ్మల నాగేశ్వరరావు |
| మెదక్ | వివేక్ వెంకటస్వామి |
| వరంగల్ | పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి |
| ఖమ్మం | వాకిటి శ్రీహరి |
| నల్లగొండ | అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ |
| రంగారెడ్డి | దుద్దిళ్ల శ్రీధర్‌బాబు |
| హైదరాబాద్ | పొన్నం ప్రభాకర్ |
| మహబూబ్‌నగర్ | దామోదర రాజనర్సింహ |

## విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ తయారుచేయాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, జూన్12 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లోని విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని, నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని సిబ్బందికి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. గురువారం నుంచి విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బీసీ సంక్షేమశాఖ, గురుకుల సొసైటీ అధికారులు, సంక్షేమహాస్టళ్ల వార్డెన్లతో సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్స్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కారం కాకపోతే జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో అధికారుల దృష్టికి తేవాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, ఎంజేపీ సెక్రటరీ బడుగు సైదులు, జాయింట్ సెక్రటరీలు తిరుపతి, మద్దిలేటి పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ తర్వాతే ప్రజాస్వామ్యం బలోపేతం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఎమర్జెన్సీ కష్టకాలం నుంచి బయటకు వచ్చిన తర్వాతే భారత ప్రజాస్వామ్యం మరింత బలోపేతమైంది అని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్‌రెడ్డి గురువారం ఎక్స్ వేదికగా అభివర్ణించారు. ఎమర్జెన్సీ నాటి పరిస్థితులకు కారణమైన వారిని జవాబుదారిగా నిలబెట్టాలని డిమాండ్ చేశారు. 'సరిగ్గా 50 ఏండ్ల క్రితం 1975 జూన్ 12న ఎంపీగా ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని పేర్కొంటూ, ఆమెను ఆరేండ్లపాటు అనర్హురాలిగా ప్రకటిస్తూ అలహాబాద్ హైకోర్టు తీర్పు వెలువరించింది. విచారణ చేపట్టిన తర్వాత ప్రధాని స్థానంలో ఉన్న వ్యక్తి ఎన్నిక చెల్లదని తీర్పు ఇవ్వడం స్వతంత్ర దేశంలో అదే మొట్ట మొదటిసారి. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్‌లోని ఫాసిస్టు, నియంతృత్వ పోకడలు బయటకు వచ్చాయి. దీని కారణంగా రెండు వారాల తర్వాత దేశ చరిత్రలోనే అత్యంత చీకటి అధ్యాయమైన 'ఎమర్జెన్సీ' మొదలైంది' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**వాణిజ్య**

### బీవోఎం వడ్డీరేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) వడ్డీరేట్లను అర శాతం వరకు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. దీంతో గృహ, వాహన, విద్యా రుణాలతోపాటు రెపో లింక్డ్ లెండింగ్ రేటుతో అనుసంధానమైన అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లు దిగివచ్చాయి. తగ్గిన వడ్డీరేట్లు ఈ నెల 10 నుంచే అమలులోకి వచ్చాయని బ్యాంక్ పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో 7.35 శాతం ప్రారంభంతో గృహ రుణాలు, 7.7 శాతం ప్రారంభంతో వాహన రుణాలు లభించనున్నాయి. బ్యాంకింగ్ రంగంలో ఇదే అతి తక్కువ వడ్డీరేట్లు కావడం విశేషం. మరోవైపు, బ్యాంక్ ఆఫ్ బరోడా మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటుని ఐదు బేసిస్ పాయింట్లు తగ్గించింది. నెల నుంచి ఏడాది లోపు కాలపరిమితి కలిగిన రుణాలకు ఈ తగ్గింపు వర్తించనున్నది.


### జీఎస్కేతో భారత్ బయోటెక్ జట్టు

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రముఖ ఫార్మా సంస్థ భారత్ బయోటెక్..జీఎస్కే పీఎల్‌సీతో జట్టుకట్టింది. ప్రధానంగా ఐదేండ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తున్న తీవ్రమైన బ్యాక్టీరియల్ డయేరియా షిగెల్లోసిస్‌ను పరిష్కరించేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పాటునందించనున్నదని ఇరు సంస్థలు ప్రకటించాయి. డయేరియా వ్యాధికి కారణమవుతున్న షిగెల్లా అనే బ్యాక్టీరియాతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రభావితం అవుతున్నారు.

# కుప్పకూలిన విమాన షేర్లు

*ఎయిర్ ఇండియా ప్రమాదంతో నష్టాలు • స్టాక్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి • భారీగా పడిపోయిన ఇండిగో షేర్ విలువ • బోయింగ్ షేర్లూ ధమాల్*





ముంబై, జూన్ 12: గుజరాత్‌లో జరిగిన ఎయిర్ ఇండియా ఘోర విమాన ప్రమాదం.. దేశీయ స్టాక్ మార్కెట్లనూ ప్రభావితం చేసింది. అహ్మదాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం మధ్యాహ్నం లండన్‌కు బయలుదేరిన ఫ్లైట్.. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. ఈ నేపథ్యంలో అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో నమోదైన ఆయా విమానయాన రంగ కంపెనీల షేర్లు పెద్ద ఎత్తున అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మదుపరులు భారీగా పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు.

**ఇండిగోకు గట్టి దెబ్బ**

దేశీయ విమానయాన రంగ దిగ్గజ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ (ఇండిగో) షేర్ల విలువ భారీగా క్షీణించింది. ఈ ఒక్కరోజే ఎన్ఎస్ఈలో ఇండిగో స్టాక్ ధర రూ.187 పతనమైంది. ఇది కంపెనీ షేర్ విలువలో 3.32 శాతానికి సమానం. చివరకు రూ.5,444 వద్ద స్థిరపడింది. ప్రమాద ఘటనతో విమాన ప్రయాణ రక్షణపై ఏర్పడిన భయాలు ఎయిర్‌లైన్ స్టాక్స్‌ను ఒక్కసారిగా సెల్లింగ్ ప్రెషర్‌లోకి నెట్టాయని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

**అనుబంధ రంగాల్లోనూ..**

విమానయాన అనుబంధ రంగాల కంపెనీల షేర్లూ నష్టాలకు గురయ్యాయి. యునిమెక్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, భారత్ డైనమిక్స్, తనేజా ఏరోస్పేస్, టాటా ఎంటర్‌ప్రైజెస్, ఎం టార్ టెక్నాలజీస్, ఆజాద్ ఇంజినీరింగ్ తదితర కంపెనీల షేర్ల విలువ 4.20 శాతం-1.34 శాతం వరకు పడిపోయింది.

**బోయింగ్ షేర్లు..**

ప్రమాదానికి లోనైన ఎయిర్ ఇండియా విమానం.. బోయింగ్ సంస్థది కావడంతో సహజంగానే ఆ కంపెనీ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. గురువారం అమెరికా స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్‌లో ఒకానొక దశలో 8 శాతం వరకు పడిపోయాయి. ఆ తర్వాత కోలుకున్నా.. 5 శాతం నష్టాల్లోనే కదలాడుతున్నాయి. ఈ ప్రమాదంతో బోయింగ్ విమానాల అమ్మకాలు ప్రభావితం కావచ్చని, ప్రపంచ దేశాల నుంచి ఆర్డర్లు తగ్గిపోవచ్చన్న అంచనాలు ఈ అమెరికా కంపెనీ ఇన్వెస్టర్లను భయపెడుతున్నాయి.

**సెన్సెక్స్ 823 పాయింట్లు డౌన్**

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 823.16 పాయింట్లు దిగజారి 81,691.98 వద్ద ముగిసింది. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం 253.20 పాయింట్లు లేదా 1.01 శాతం కోల్పోయి 24,888.20 వద్ద స్థిరపడింది. దీంతో వరుస లాభాలకు బ్రేక్ పడ్డట్టైంది. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, మిడిల్‌ఈస్ట్ దేశాల్లో ఉద్రిక్తతల నడుమ ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లో నడిచాయి.

**నష్టాల్లో విమానయాన, అనుబంధ రంగ కంపెనీల షేర్లు**

| కంపెనీ | షేర్ విలువ | నష్టం |
| --- | --- | --- |
| ఇండిగో | రూ.5,444 | రూ.187 (3.32%) |
| హిందుస్థాన్ ఏరోనాటిక్స్ | రూ.4,944 | రూ.95.80 (1.90%) |
| టాటా ఎంటర్‌ప్రైజెస్ | రూ.3,566.60 | రూ.130 (3.52%) |
| భారత్ డైనమిక్స్ | రూ.1,869 | రూ.25.40 (1.34%) |
| ఎంటార్ టెక్నాలజీస్ | రూ.1,687 | రూ.34.90 (2.03%) |
| ఆజాద్ ఇంజినీరింగ్ | రూ.1,609.90 | రూ.47.50 (2.87%) |
| యునిమెక్ ఏరోస్పేస్ | రూ.1,222 | రూ.53.60 (4.20%) |
| భారత్ ఎలక్ట్రానిక్స్ | రూ.386.50 | రూ.6.40 (1.63%) |
| తనేజా ఏరోస్పేస్ | రూ.374.40 | రూ.7.60 (1.99%) |
| స్పైస్‌జెట్ | రూ.44.68 | రూ.0.81 (1.78%) |

- *గమనిక ఈ షేర్ల విలువ ఎన్ఎస్ఈలోనివి*

### ఒక్కరోజే రూ.5.98 లక్షల కోట్లు హైట్

*స్టాక్ మార్కెట్ నష్టాలతో ఈ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల షేర్ల విలువ రూ.5,98,759.27 కోట్లు హరించుకుపోయింది. దీంతో మదుపరుల సంపద రూ.4,49,58,383.92 కోట్లకు పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లు, వీక్లీ ఎఫ్అండ్‌వో గడువు ముగియడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసినట్టు చెప్తున్నారు.*

# సీఏల చేతుల్లోనే ఆర్థిక భద్రత

**మీ నిజాయితీయే.. మీ విలువైన ఆస్తి**

**సీఏల జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి**



హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): వ్యాపారాలు, సంస్థలు, ప్రభుత్వాల ఆర్థిక భద్రత చార్టెడ్ అకౌంటెంట్ల (సీఏ) చేతుల్లోనే ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. సీఏలు నైతికతకు కట్టుబడి ఉండాలని, ఏఐ టెక్నాలజీ యుగంలో నిజాయితీయే మీకు అత్యంత విలువైన ఆస్తి, పనిలో ఎల్లప్పుడూ నిజాయితీ ప్రతిబింబించాలని ఆకాంక్షించారు. సీఏ బాధ్యతలు బ్యాలెన్స్ షీట్‌కే పరిమితం కాబోవని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఐసీఏఐ, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో నగరంలో గురువారం ఏర్పాటు చేసిన సీఏ విద్యార్థుల జాతీయస్థాయి సదస్సులో భట్టి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ రాష్ట్రం పోటీ పడుతున్నదని చెప్పారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ.. దేశవ్యాప్తంగా బయటికి వస్తున్న సీఏ విద్యార్థులకు కూడా వేదికగా మారిందని వెల్లడించారు. సీఏ కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు రాష్ట్రంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భరోసా ఇచ్చారు. భారతదేశ ఆర్థిక, ధన, వినియోగ నైతికతకు మూలస్తంభంగా ఐసీఏఐ నిలుస్తున్నదని తెలిపారు. బిజినెస్ సంస్కరణలు, స్టార్టప్‌లకు చేయూత, ప్రజా ఆర్థిక వ్యవస్థల బలోపేతం ఇవన్నీ సీఏల పాత్రతోనే ముందుకు సాగుతాయని చెప్పారు. సీఏలు ఉద్యోగులు కాకుండా ఉద్యోగ దాతలుగా మారాలని, కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.



## బెంజ్ నుంచి సరికొత్త మాడల్

**ధర రూ.4.3 కోట్లు**

న్యూఢిల్లీ, జూన్ 12: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్..సరికొత్తగా జీ సీరిస్ మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏఎంజీ జీ 63 కలెక్టర్ ఎడిషన్‌గా విడుదల చేసిన ఈ మాడల్ ధర రూ.4.3 కోట్లుగా నిర్ణయించింది. కేవలం 30 యూనిట్లు మాత్రమే విక్రయిస్తున్నది.

# కీలక ఖనిజాన్వేషణలో సింగరేణి

హైదరాబాద్ జూన్ 12 (నమస్తేతెలంగాణ): సింగరేణి తాజాగా కీలక ఖనిజాల అన్వేషణ, పరిశోధన రంగాల్లో తొలి అడుగు వేసింది. ఈ దిశగా సీఎస్ఐఆర్(కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్), ఐఎంఎంటీ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. గురువారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నీతి ఆయోగ్ సభ్యుడు, డీఆర్డీవో రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ వీకే సారస్వత్ సమక్షంలో సింగరేణి జీఎం (ఎక్స్‌ప్లోరేషన్) బీ శ్రీనివాస్, జీఎం(బీడీ అండ్‌ఎస్పీ) రామదాసు, సీఎస్ఐఆర్, ఐఎంఎంటీ చీఫ్ సైంటిస్ట్..హైడ్రో మెటలర్జీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ కాళీ సంజయ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సింగరేణి చైర్మన్ బలరాం మాట్లాడుతూ... వ్యాపార విస్తరణలో భాగంగా ప్రభుత్వాల సూచనల మేరకు కీలక ఖనిజాల అన్వేషణలోకి అడుగు పెట్టామన్నారు. ఈ రంగంలో సీఎస్ఐఆర్-ఐఎంఎంటీలు సాంకేతిక సహకారం అందిస్తాయని వెల్లడించారు. సింగరేణి ఓపెన్ కాస్టుల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని తెలిపారు. అలాగే ఎన్టీపీసీ నుంచి విద్యుత్ ఉత్పత్తి సమయంలో విడుదలయ్యే ఫ్లైయాష్‌లోనూ ఈ మూలకాలను కనుగొన్నారన్నారు. మణుగూరు సమీపంలోని దుర్గంగుట్ట బ్లాక్‌లో సగటున 266.21 పీపీఎం స్థాయిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు జీఎస్ఐ నిర్ధారించిందని, మొత్తంగా సింగరేణి గనుల్లో లాంథనం, సీరియం లాంటి ఆరు రకాల రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఇట్రిడియం, స్కాండియం, డిస్ప్రోజియం లాంటి హెవీ రేర్ ఎర్త్ మూలకాల ఉనికిని గుర్తించామన్నారు.